# ★ శవపంచాయతి ★

పంతులు మరణవార్త క్షణంలో వూరంతా వ్యాపించింది. గ్రామపెద్ద గరటయ్య - షావుకారు రంగయ్య యింకా కొందరు గ్రామస్థులు పంతులు యింటి ముందు వీధిఅరుగుపై సమావేశమయ్యారు. పంతులు శవాన్ని పంచాయతి చేసి దహన క్రియలు జరిపించే సదుద్దేశం వారందరిని ప్రొద్దుపొడవకముందే అక్కడకు చేర్చింది. అందరూ పంతుల అకాలమృతికి తమ సంతాపాన్ని వెల్లడిస్తూ మాట్లాడసాగారు.

"పాపం! ఎక్కడ పుట్టాడో - ఎక్కడ పెరిగాడో - యీవూళ్లో కాలందీరింది -" రంగయ్య చుట్ట ముట్టించుకుంటూ తాపీగా అన్నాడు.

"ఇంతలోవుంది మనస్థితి. అందుకే గా జీవితం బుద్బుదప్రాయమన్నారు." గరటయ్య గంభీరంగా ముఖంపెట్టి అన్నాడు.

"వృధాగా గ్రామస్థులతో పేచి పెట్టుకొన్నాడు. లేకుంటే యింతఘోరం జరిగేదికాదు -"

"తెలిసీ తెలియని మూర్ఖం - లేకుంటే షావుకారు రంగయ్యతో ఢీకోటం మాటలా -"

"నన్నొక్కడినే గిరిలో పెడతావేం గరటయ్యా. నీమాటమాత్రం పంతులు ఏమంత ఖాతరుచేశాడు."

"కాగేపాలలాగ బుస్సుమని పొంగే వయసు - కొంచెంపిల్లతరహాలో పోయాడు. ఇక్కడుండేవాళ్లు పోమా పోమాలని తెలియదు పాపం! -"

"పోటీ స్కూలు పెట్టినప్పుడు కొత్త తెలుసుకొన్నాడు -"

"నీకు చెప్పానో లేదో - ఆరోజు నా దగ్గరకొచ్చాడు పంతులు - వచ్చి ఏవో మాటలప్రస్తావనలో - నాతో జారవిడిచాడయ్యా -" అంటూ ఆరిపోయిన చుట్టను వెలిగించుకొనే పనిలో మునిగిపోయ్యాడు గరటయ్య.

"ఏమన్నాడూ - ఆ పాడుచుట్ట ఇప్పుడే ఆరిపోవాలీ!" పంతులు ఏమి చెప్పాడో వినాలనే కుతూహలంలోవున్న రంగయ్య ఆలస్యాన్ని భరించలేకఅన్నాడు.. రెండు మూడు అగ్గిపుల్లలు గీచినా గరటయ్య చుట్ట వెలగలేదు.

## పి. పరంధామయ్య

"ఆచుట్ట పారవేయ్ - నల్లంగా నుసి, అదేంకాలి ఏడుస్తుంది. నేనిస్తాగాని, చుట్ట- ఏమన్నాడో చెప్పు -"

గరటయ్య చుటను విసిరిపారేస్తూ "ఏదో పొట్ట చేత్తోపట్టుకొని వచ్చాను యీవూరు. పోటీ స్కూలుపెట్టి నాకు అన్యాయం జేస్తున్నారు. దీనిగ్గా నేను ఎప్పటికైనా పగ దీర్చుకుంటాను చచ్చి దయ్యమై అయినా సరే..."అని ఆరోజు తనసొద వెళ్లబోసుకున్నాడు పంతులు -"

"ఆ..." రంగయ్య గుండె ఝల్లుమనగా వులిక్కిపడ్డాడు.

"దేనికోయ్. అంతబిత్తరపోతావ్. చచ్చి వోళ్లంతా దయ్యాలైతే యిక బ్రతికున్న మనకి లోకంలో చోటుంటుందా -"

"నిజంగాఅన్నాడా - అయితేఎప్పుడూ చెప్పలేదేం"

"పంతులంటే అప్పుడు ఎవరికీగిట్టకుండా వుంటూవుండె. ఈమాట చెప్పితే అంతా అతనిమీద విరుచుకపడతారని చెప్పలేదు."

"వచ్చేలోపల వూళ్లో కొత్త చిచ్చు పెట్టిపోవాలనుకున్నాడు. బంజర్లని - అసలుమినాలని - అయితే ఆ ఎత్తు పారలేదుగాని..."

"సరే! అతని పీడా యీరోజుతో వదిలిపోయిందిగా—"

"ఇంత త్వరగా వదిలిపోవటం నీకు యిష్టమున్నట్టు లేదే—"

"ఇష్టమున్నా లేకపోయినా వదిలేమాటయితే పరవాలేదు. ఏ దయ్యమో - భూతమో అయి సాధిస్తే..."

"కొత్తఅయ్యోరు అందుకనే భయపడి వెళ్ళిపోయాడు -" అప్పుడే అక్కడకు వచ్చిన రామయ్య యీ తాజావార్త అందించాడు.

"వెళ్లిపోయాడూ - భలేవాడే."

"చచ్చి దయ్యమై పట్టుకొని అయినా నిన్ను సాధిస్తాను అని కొత్తయ్యోరుతో యీ పంతులు అన్నాడంట ఎప్పుడో - దాంతో భయపడి - పంతులు చచ్చిపోయాడని తెలియగానే - వుడాయించేశాడు ఆయన."

"ఇక రాడటనా."

"ఎప్పుడూ యీవూరుతట్టు మెదలనని చెప్పిపోయాడట."

రంగయ్య తొట్రుపడుతూ - "ఓరే - శేపుమారిలా వున్నావే." అన్నాడు.

"ఏమిటోయ్ - అకంగారు. పెట్టుబడేమున్నా పెట్టావా."

"అంతా యింతా కాదు వందరూపాయలు."

"ఆ అయ్యోరుకు నీ సొమ్ము ఎగ్గొటానికి మంచి సాకే దొరికింది."

"ఎగ్గొటం మాటలా - నోటుంది."

"దేశంమీద వాడు పోతే - నోటు పెట్టుకొని ఏంజేస్తావ్."

"సరే నా సొమ్ము ఎంతమంది ఎగ్గొలేదు. వాళ్ళలో వీడూ వొకడని అనుకుంటాను"

"పంతులుపై పగంటే సామాన్యమా రంగయ్యా - వందకు వందా పోయింది - పైగా దయ్యమో - భూతమో అయి..."

"ఆ. వాడిబొంద. పెద్ద చిన్నా లేకుండా పోటుపడిందానికి బాగా అనుభవించాడు."

"పాపం!—అన్యాయంగా చచ్చాడు."

"ఏమిటా అన్యాయం."


ఒక గంటలో యౌవ్వనము
కామస్తంభన
ధాతుపుష్టి, సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది విరాశచెందిన వృదులయందు శక్తి ఉత్సాహము నిచ్చును రు 2-8-0
మదనమంజరి ఫార్మసీ
184, చైనాబజారు రోడు. మద్రాసు-1.
బెజవాడ-శ్రీనివాస మెడికల్‌స్టోర్సు-పార్కురోడ్
రాజమండ్రి-ఈశ్వరదాస్ & కో. మెయిన్‌రోడ్
వెల్లూరు:- ఆర్యన్ ఫార్మసీ-ట్రంకురోడ్
ఇతర కేంద్రాలకు ఏజెంట్లుకావాలి

కుష్టు ★ బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, వవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము:
వలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమము"
గోపాలపురం తూర్పుగోదావరి.

"ఇంత చిన్నవయసులో చావటం అన్యాయంగాక మరేముంది?"

"సరే! దానికి ఎవరేంజేస్తారు."

"చేసిందంతా మనమే - ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా అతని చావుకు మనమే కారణం."

"విడిసినట్టేవుంది నీ వాదన - కాలందీరి ఆయన జస్తే నీ వాగు డేమిటి."

"ఆయన కాలం తీరటానికి మనం కారకులమయ్యామనే నే చెప్పటం."

ఇంతలో హఠాత్తుగా వొక నూతనవ్యక్తి పట్నవాసపు దుస్తులతో అక్కడి కొచ్చాడు. అతడు అంతకుముందు కొంతసేపటినుండి చెట్టుచాటున నిలబడివుండటం ఎవరూ గమనించలేదు. హఠాత్తుగా వొక కొత్తవ్యక్తి తమ మధ్యవచ్చి నిలబడటంతో అక్కడ సమావేశమైనవారంతా నిశ్చేష్టులయ్యారు.

"మంచి సమయానికే వచ్చాను. వచ్చి రావటంతోటే యింత విలువైన సమాచారం దొరకటం ఎప్పుడోగాని జరుగదు. మీ పేరు గరటయ్య అనుకొంటాను. వీరు రంగయ్యగారు. మీ పరిచయం నా మహాద్భాగ్యంగా ఎంచుకుంటున్నాను..."

"మీ రెవరండి-" రంగయ్య చురచుర అతనివైపుచూసి అడిగాడు.

"నేను పోలీసుఆఫీసర్ను. సి. ఐ. డి సెక్షను. పంతుల్ని ఎవరో చంపారని టెలిగ్రాం వచ్చింది ఇన్వెష్టిగేషన్ కార్యభారం నా నెత్తినబడ్డది నా బాధ్యతను నెరవేర్చటంలో మీలో కొందరికి బాధ కలుగవచ్చు. కాని అశోక ధర్మచక్రం క్రింద వున్న మనం న్యాయంకొరకు అవన్నీ భరించాల్సివుంటుంది. ఇంతకుముందే మీరు ముచ్చటించుకొనే మాటలు వినే అత్యుత్తమభాగ్యం నాకు కలిగింది. దానివల్ల అత్యంత క్లిష్టమనుకున్న యీ కార్యం చాలావరకు సులువైనట్లు కనబడుతుంది. మీరు మాట్లాడుకున్న దాన్నిబట్టె పంతులును చంపింది మీరేననే అనుమానం నాకు తోస్తోంది." అని గడగడా మాట్లాడేశాడు.

"మేమేం అనుకోలేదండి." గరటయ్య - రంగయ్య దీనంగా అన్నారు.

"పంతులు చచ్చాడు. పీడ వదలిపోయింది - అని అనుకోలేదూ."

"లేదండి."

"నిజం చెప్పండి- అన్యాయంగా చచ్చాడని గూడా అనుకున్నారు."

"బడి తీసేశారు. జీతం రాలేదు. పస్తులుపడి తిండిలేక చనిపోయాడు. అందువల్ల ఆమాట అన్నామండి."

"అన్నారు కాబట్టే నేను చెప్పగలుగుతున్నాను. చూశారూ - మీరు చెప్పిన కారణం యింకా గొప్పదైనటువంటి నేరానికి పాత్రమౌతుంది. స్వతంత్ర భారత దేశంలో తిండిలేకుండా చచ్చాడని చెప్పడానికి ఎవరికీ హక్కు లేదు."

"చచ్చాడు కాబట్టి చెప్పానండి."

"కాదు. ముమ్మాటికి గాదు. అతడు చావటానికి కారణం మీరు. ఆ మాటే మీరు అనగా నేను విన్నాను. ఒరే అప్పన్నా. ఏదీ - ఆ ఫైలిటివ్వు."

అప్పన్న చెట్టుదగ్గరనుండి వచ్చి ఫైలు తీసి యిస్తాడు.

"ఈ గరటయ్యకు ఎటొచ్చీ మాటా తెలవదండి. ఏదో తెలివితక్కువగా అన్నాడు. మమ్మల్ని కాస్త దయ చూడండి-" రంగయ్య వణకుతూ దీనంగా అన్నాడు.

"ఏదో పిల్లలు గలవాళ్లం. దీంట్లో మమ్మల్ని యిరికించబాకండి." పులుల్లాంటి వాళ్లు యీలా పిల్లులైపోవటంతో చుట్టూ చేరిన జనం ఆశ్చర్యపోయారు.

"అతని చావుతో మీకేమీ సంబంధం లేకపోతే మీ కెందుకయ్యా అంతిభయం-"

"ప్రమాణపూర్తిగా లేదండి."

"ఆ విషయం కోర్టులో చెప్పండి."

"ఈ పంతులు చచ్చికూడా సాధించేట్టున్నాడు. మామీద కాస్త కనికరంచూపించి ఆ కోర్టులచుట్టు తిరిగేట్టు చేయబాకండి."

"మీరతన్ని బతికివున్నప్పుడు సాధిస్తే- అతను మిమ్మల్ని చచ్చి సాధిస్తున్నాడు. అతని ప్రాణాన్ని తీసేప్పుడు మీరు కోరే కనికరం కాస్తన్నా లేకపోయిందా."

"అతని ప్రాణాన్ని మేము తీలేదండి."

"అయితే ఎందువల్ల చచ్చాడు. ఏ రోగం లేకుండా మనిషి అకస్మాత్తుగా ఎందుకు చస్తాడు."

"అకస్మాత్తుగా చావలేదండి. రెండు మూడు రోజులు మాటా పలుకు లేకుండా పడివుండి..."

"ఒక్కసారి ప్రాణం తీయకుండా చిత్రవధ చేశారన్నమాట."

"ఒకరు చేసేదేముందండి యిందులో - అతని విధాయకం అట్లుండింది. చనిపోయాడు"

"ఏదో బడిపంతులు. కడుపు చేత్తో పట్టుకొని మీ వూరు వచ్చాడు. అతన్నింతపని చేస్తారా—"

"మేమేం చెయ్యలేదు బాబూ అంటున్నా అయ్యగారు చిత్తగించటం లేదు"

"ఇక చాలించండయ్యా సొద - నేను కొన్ని ప్రశ్నలడుగుతాను. సూటిగా జవాబు చెప్పండి."

"పంతులిది యీ వూరేనా-"

"కాదండి - ఏ వూరైందికూడా మాకు తెలవదు."

"భార్యా పిల్లలు వున్నారా."

"లేరండి"

"ఈ వూరికొచ్చి ఎంతకాలమయింది."

"దాదాపు మూడేళ్ళయింది."

"అతని స్వభావమెట్టిది"

"కొంచెం కొత్త్రిమనిషి"

"అంటే—"

"ఎవరితో ఎట్టా మెలగాలో తెలవదండి"

"నూక్కాలు పరిస్థితి?"

"నిరుటివరకు బాగానే జరిగింది."




"తర్వాత—"

"ఒంటిపూట బడి పెట్టించరన్నారు. దాంతో అతని స్వభావం మారిందండి."

"ఏంజేశాడు."

"అందరిని వొంటిపూట రమ్మన్నాడు."

"సరే రూలునుబట్టి ఆ విధంగా అన్నాడు."

"ఏదో కనిపెట్టి పోవద్దండి"

"ఓహో - మిమ్మల్ని కనిపెట్టిపోలేదు గనుక యీపని జేశారు"

"మేమేం చేయలేదండి"

"పోటీ స్కూలు పెట్టారు కదూ."

"మా పిల్లలకు చదువురాదని పెట్టుకొన్నా మండి."

"అతని బడికి పిల్లల్ని పోనీలేదుగదూ."

"మేము పోనీకపోతే ఆగుతారా - వాళ్లే వెళ్ళలేదు."

"సరే ఆవిధంగా అతనికి మీకు మన స్పర్థ బయలుదేరింది. అతడు మీపాలాల్లో అసలు మీనా ప్రదేశాలు వెదికి పేదవాళ్ళకు చెప్పి అర్జీలు పెట్టుకోమన్నాడు. అతడు బ్రతికివుండటం మీకు మహాప్రమాదంగా పరిణమించింది. అందువల్ల వొకనిండు ప్రాణాన్ని నిలువునా హత్యచేసి పారేశారు."

"మీరీ విధంగా అభిప్రాయపడితే మేము చెప్పేదేముంది అతనికి రెండు నెలలనుండి జీతంరాలేదు. బడి ఎత్తివేశారు. కొత్తగా జరుగుబాటులేకుండా పోయింది. ఆఖరికి తిండికి నసిగి చచ్చిపోయాడండి."

"హుష్ - ఆమాట అనబాకవయ్యా. అది అన్నిటికంటె గొప్ప నేరం. తిండిలేక చావటం మన రాజ్యాంగం వొప్పుకోదు. అదీకూడా గాక మన ఆంధ్రరాష్ట్రంలో కావలసినంత మిగులు ధాన్యంవుంది."

"ఏదో పల్లెటూరోళ్ళం బాబూ - ఆమాత్రం తెలిసి చచ్చినోళ్ళంకాదు. కాస్త మామీద దయచూపండి"

"సక్రమంగా విచారణచేసి రిపోర్టు పంపటం నా విధి."

"ఆ రిపోర్టులో నన్ను యిరికించకాకండి."

"ఎందుకూ. ఝామునేపయింది యిక్కడికొచ్చి - ఎవ్వడూ కాఫీకూడా యిచ్చిన పాపాన పోలేదు."

"నేను నిమిషంలో పెట్టించుకొస్తానండి భోజనం ఏర్పాటుకూడా చేసి వస్తాను."

"త్వరగా రావయ్యా అప్పన్నా! ఆయన వెంట వెళ్ళిరా."

రంగయ్య అప్పన్న వెళ్లారు.

"గరటయ్యగారూ - యింతకూ ఆ పంతులు చచ్చినట్లు ధృవపడిందా-"

"చచ్చినట్టే చెప్పారండి."

"చెప్పారుకాని మీరు చూడలేదు. ఈ వూళ్ళో వైద్యుడుంటే పిలిపించు."

ఇంతలో కాఫీతీసుకొని అప్పన్న, అతని వెంట రంగయ్య వచ్చారు

"రంగయ్యా! తిండికూడా మీ యింట్లో నేనా?"

'అవునండి."

"అప్పన్న చెప్పాడుకదూ"

"చెప్పాడండి. అన్నీ తయారైపోతాయి లెండి"

"అప్పన్నా! యిటురా.." అంటూ అప్పన్నను కొంచెం దూరం తీసుకపోయి ఏదో గుసగుసలాడాడు. ఇంతలో వైద్యుడు వచ్చాడు.

"వైద్యుడు శరభయ్య వచ్చాడండి" రంగయ్య చేతులుకట్టుకొని అన్నాడు.

"పోదాం పదండి-" అందరూ పంతులుండే వసారాలోకి వెళ్ళారు. చాపమీద పంతులు పండుకొని వున్నాడు. వైద్యుడు చాపమీద కూర్చుని పంతుల చెయ్యి తీసుకొని నాడి చూస్తాడు.

"నాడి దొరకటంలేదండి."

"ఎంతకాలమయివుంటుంది చనిపోయి"

"ఒక గంటసేపుకూడా అయివుండదండి"

"వోరి పిడుగా - రాత్రే చచ్చిపోయాడనుకున్నాం."

ఇంతలో పంతులు మెల్లిగా కళ్లు తెరిచాడు. వైద్యుడు కెవ్వున కేకేసి వెనక్కి విరుగబడ్డాడు. అందరూ వాకిలివద్దకు పరుగెత్తారు.

"నేనింకా చావలేదు." పంతులు హీన స్వరంతో అన్నాడు.

"ఆ..." అందరు భయ సందేహాలతో అతనివైపు చూశారు.

"దాహం యివ్వండి-"

"దాహమే కాదు. కాఫీ కూడా యిస్తాం నీవు బతికుంటే అంతే చాలు. ఎవర్రా అక్కడ. వెంకడూ కాస్త మంచి నీళ్లు పట్టుకరా - కాఫీ పెట్టమని చెప్పు."

"నీవు చనిపోయావని టెలిగ్రాం వచ్చింది వైద్యుడు కూడా అట్లనే అన్నాడు. ఇక్కడున్న ప్రతివాడూ అదే మాట చెప్పాడు. నా ఫైల్లోకూడా అదే రాశాను. నీవు బ్రతికిచాలామందిని ఇబ్బంది పెట్టేట్లున్నావు."

"ఏం యిబ్బంది లేదు. నేను చచ్చి చాలాకాలమయింది కొత్త విద్యావిధానం రాగానే చచ్చిపోయాను"

"అట్లా జెప్పు - అయితే నిన్ను చంపిందెవరో కాస్త జెప్పు."

"వూళ్లోవారు—"

"ఏ ఆయుధంతో చంపారో అదికూడా చెప్పండి."

"నూతన విద్యావిధానమనే గన్‌తో పోటీస్కూలనే తూటా బెట్టి కాల్చేశారండి"

మంచిది అవిగో మంచినీళ్లు త్రాగండి. మీరు కోర్టులోకూడా యిదేవిధంగా చెప్పాలి. పంతులు గ్లాసెడునీళ్లు గటగటా త్రాగేశాడు.

"ఏంరంగయ్యా! పంతులు వాఙ్మూలాన్నిబట్టి మీ పై కేసు బాగా చార్జి అయ్యేట్టుంది"

"పంతులు బతికున్నాడు కదండి."

"అబ్బే! అతనే చెప్పతున్నాడుగా - చచ్చిపోయినానని."

"మాట్లాడుతూ చచ్చావంటావేమయ్యా పంతులూ."

"ఎప్పుడో చచ్చిపోయాను బాబూ మీ వలనన. పోటీ స్కూలు బెట్టి నన్ను ఖూనీ చేశారు."

"పంతులూ! నీవు బతికున్నావని ఒప్పుకో. నీవు స్కూలు మళ్లీ పెట్టుకొందువుగాని. నీబడికే పిల్లల్ని పంపుతాం. కొత్తయ్యోరు కూడా వెళ్లిపోయాడట ఆదీగాక వొంటిపూట బడికూడ పొయ్యిందట. దాంతో వచ్చిందేగా మనకు పేచీ"

"అబ్బే! ఆలా వీలులేదండి అతను చచ్చినట్టు రికార్డయిపోయింది."

"మాపండి - ఆ రికార్డు కాస్త మార్చు చేయించండి."

వీర్యస్తంభన రసాయనం : శుక్రనష్టము నాపి మంచి బలం వీర్యవృద్ధి కల్గించును. సబ్బ రూ. 5/-
గర్భ నిరోధిని: యిటు మీదట గర్భం రాకుండా ఆపును, లోపల్కి సేవించే అతి నమ్మకమైన మందు. రు 10/-
నపుంసక తైలం: చిన్నదైన అంగ నరములు, తిర్గి యధాప్రకారమై పూర్తి సౌఖ్యమునకు రూ 10/-
పై వాట్కి ఖర్చులు రూ. 1 0-0 లు అగును. కావలసినచో ముందుగాపం పేది
డాక్టర్ రత్నం సన్స్, మెడికల్ హాల్, మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్.

"అలా వీలులేదండి -"

పరవాలేదులే బాబూ - మహామహా రిపోర్టులు మాయమైపోతున్నయ్ - అదికూడాగాక పంతులు బతికున్నాడు."

"ఏదో చాన్సువల్ల బ్రతికాడే అనుకుందాం. అంతమాత్రంచేత మీ రతన్ని చంపాలనిచేసిన ప్రయత్నం క్షమించటానికి వీలు లేనంత దారుణమైంది."

"చెప్పుపంతులూ - నిన్ను చంపాలనే వుద్దేశం మా కెప్పుడైనా వున్నదా ?"

"నానూకలుసంగతి చెప్పండిబాబూ-"

"మారాజుగా పెట్టుగో - యివిగో కాఫీ తెచ్చారు. ముందివి తాగు." పంతులు కాఫీ త్రాగుతూ "చచ్చేవాణ్ణి బతికిస్తున్నారు. తీరా బ్రతికినతర్వాత - నూకలు లేదు పొమ్మంటే -"

"ఎంతమాట పంతులూ - గరటయ్య మాట తప్పేవాడని యీవూళ్లో ఎవరిచేతయినా పలికించు -"

"ఏదో మీదయ..."

"అంతే కాదు - జీత మిచ్చిందాకా కాస్త గింజలుకూడా పంపిస్తాలెండి -"

"ఇక నా విషయం ఫైసలు చెయ్యండి రంగయ్యగారూ -" కొత్తవ్యక్తిఅన్నాడు.

"ఫోంచేయండి - మాట్లాడుదాం -"

"ఇక మాట లేమున్నయ్ - అనుకొన్నదేదో యిచ్చేయండి -"

"పంతులు బ్రతికాడు. బ్రతికానని చెపుతున్నాడు."

"పంతులు బ్రతకబట్టి మీ పైకేసు బాగా చార్జి అయ్యేట్టుంది. అతని సాక్ష్యమొక్కటే చాలు మిమ్మల్ని జైలుకు పంపటానికి. అతన్ని చంపబోయారు. ... ఏమిటిరా అప్పన్నా కారు శబ్దంలాగుందే -"

"అవునండి. మనకారే -"

"చెంబుతో కాస్త నీళ్లు పట్టుకురా - అలా వెళ్ళొస్తాం - ఆలోచించి చెప్పండి ...త్వరగావస్తాం - రారా అప్పన్నా -" అని పొలంవైపు వెళ్ళిపోయారు.

"ఏం పంతులూ బలే యాపక తిన్నావే..."

"నేనేం చేశానండి అయ్యా."

"సరేగాని - నీవు వొక్కసంగతి చెప్పవయ్యా. నన్నెవరూ చంపదలుచుకోలేదు. ఆ వుద్దేశం ఎవరికీ లేదు అని చెప్పు. ఏం. నీ నూకలుమాత్రం ఖాయం. జీత మిచ్చిందాకా వూళ్ళో గింజలు దండి పంపిస్తాం."

"చిత్తం తమ దయండి బాబూ. అలాగేనని చెపుతున్నాగదండి" ఇంతలో అక్కడికి పోలీసులతో వొక జీపు వచ్చింది.

"ఓ రయ్యో - పోలీసుకారే." రంగయ్య భయపడుతూ అన్నాడు. జీపులోనుంచి పోలీసు సబిన్స్పెక్టరు దిగి వాళ్లదగ్గిరికివస్తూ-


"ఇకేమన్నా వొక బక్కపల్చటి ఎర్రటి కుర్రోడు - వొక కన్ను కొంచెం మెల్లిగా వుంటుంది - వచ్చినట్టు చూశారా."

"వచ్చాడండి-యిప్పుడే బైటికి వెళ్లాడు."

"ఎటుపోయాడు - వీళ్లకి అతను వెళ్ళిన దిక్కు చూపండి - పోండిరా- జాగ్రత్తగా పట్టుకరావాలి."

"ఎవరండి అతను."





కృష్ణవొడ్డునుంచి బెజవాడ కొండలు, పట్టణం. ఫొటో: వై. రామకృష్ణరావు—బందరు.

"ఎవరని చెప్పుకుంటారు. ఒకచోట మంత్రిగారి అల్లుడు - మరోచోట సేల్సు టాక్సు ఆఫీసరు - యింకోచోట పొగాకు యిన్స్పెక్టరు. ఇట్లే వేషాలు వేసుకొని ప్రజలను బెదిరించి డబ్బుగుంజే వుద్యోగం."

"ఓరి - యీ డిల్లు ... యిప్పటిదాకా అదిరిపించి చంపాడండి మమ్మల్ని."

"ఇక్కడే అవతారం ఎత్తాడు"

"పోలీసు సి. ఐ. డి నని చెప్పి—యీ పంతులు బైర్లుగమ్మి పడుంటే ఆయన్ని మేము చంపామని కేసు పెట్టతానని గోల చేశాడండి."

"వాడు పోయినచోట ఏదో ఒక గలభా వుండాల్సిందే. బలే కేపుమారి - మా కారు మోతవిని వెళ్లివుంటాడు కదూ."

"అవునండి కారు మోత వినగానే- వీళ్లు పట్టుకరమ్మని - చెంబుతో నీళ్ళుతీసుకొని వెళ్ళాడు..."

"కారు దూరంగా నిలిపివస్తే చిక్కేవాడే..."

"ఇప్పుడుమాత్రం ఎక్కడికి వెళ్లివుంటాడండి - వీళ్లు పరుగెత్తి వెళ్ళారుగా"—

"చూస్తుండగానే కళ్ళలో దుమ్ముకొట్టి వెళ్లే అసాధ్యుడు వాడు...అరుగో - ఏమిటోయ్ - చిక్కలేదూ?"

"చాకలోపులండి అంతాను. ఎటెళ్ళాడో పత్తా చిక్కలేదు."

"ఆ...నావెంట రండి - వాడి నివాళి యీ ప్రాంతాలన్ని గాలించి అయినా పట్టాలి - జీపు యిక్కడే వుంటుంది. జాగ్రత్తగా చూస్తుండండి."

పోలీసులు, యినస్పెక్టరు వెళ్లిపోయారు.

"ఓరి వీడికేపు బంగారంగానూ. భయపడి చస్తిమికద గరటయ్యా"

"వాడి మాటలు - వేషం మాను. ఎపుడు మాత్రం బోల్తా పడకుండా వుంటాడు."

"ఆయన ఎవడయితే నాకేంగాని. ఇంత జీవనాధారం కల్పించాడు మహారాజు -" పంతులు భక్తితో అన్నాడు.

"ఏంది పంతులూ - బడి పెట్టుకోమంది మేము, గింజలు దండి యిప్పిస్తామంది మేము, ఆ కేపుమాగోడిని మాగాజని చేశావే"

"చిత్తమండి అయ్యా! వారు రాకపోతే మీకు యీ మంచిబుద్ధి పుట్టేది కాదేమోనని నా అనుమానం."

"సరేలే. ఏమైతేనేం వచ్చినట్టు వమండి కార్యం సాధించావు."

"ఏదో తమ దయ - రేపటినుండి బడి పెట్టుకోమంటారుగదూ."

"బడి పెట్టుకొని - మునుపటి పిచ్చి వేషాలు వేయకుండా"

"ఒంటిపూట బడి పద్ధతికూడా పోయిందటలేండి. రెండు పూటలా పిల్లలు యధేచ్ఛగా రావచ్చు."

"సరే, పోయి, యీ గో నెక్కడయినా జాగా పెట్టించుకో..."

"చిత్తం అండి అయ్యా - రేపటినుంచి బడి పెట్టుకొంటాను."

"అట్లనే - పో. గరటయ్యా యిక రా పోదాం." ★


నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము,నిక్కాక,నిస్సత్తువ,శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు|| డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.

టి. పి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిడేపి- నెల్లూరు జిల్లా.